సాక్షి
వికారాబాద్

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



ప్రమాదాల నివారణకు..
అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అగ్నిమాపక శాఖ జిల్లాలో మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 8లో▸



భళా.. ఫుడ్ మేళా
తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఫుడ్ మేళా అలరించింది. 8లో▸



సొంత భవనాలకు మోక్షం
కొత్తగా ఏర్పడిన పంచాయతీలతో పాటు పాత వాటికి అవసరమున్న చోటా సొంత భవనాల నిర్మాణానికి మోక్షం లభించింది. 9లో▸



న్యూస్‌రీల్

నిరుద్యోగులకు ద్రోహం చేస్తున్న కేసీఆర్

- టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌ను తొలగించాల్సిందే
- నిరుద్యోగ జేఏసీ నాయకుల డిమాండ్



రేవంత్‌రెడ్డిని కలిసిన నిరుద్యోగ జేఏసీ నాయకులు

అనంతగిరి: నిరుద్యోగులకు సీఎం కేసీఆర్ ద్రోహం చేస్తున్నారని నిరుద్యోగ జేఏసీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం వారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఛైర్మన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్లు వెలువడటంతో నిరుద్యోగులు ఎంతో సంతోషపడ్డారని అన్నారు. లీకేజీతో వారి ఆశలన్నీ అడియాశలయ్యాయని అన్నారు. ప్రభుత్వం అలసత్వం వల్లే పేపర్లు లీకేజీ అయ్యాయన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు ఉద్యమమిస్తామన్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహులు, నిరుద్యోగ జేఏసీ నాయకులు వేణుగోపాల్, రెడ్డి శీను తదితరులు పాల్గొన్నారు.

పూలే ఉత్సవాల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



అనంతగిరి: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు కె శ్రీనివాస్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనెల 11న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాలను జయప్రదం చేయాలని, బడుగుబలహీన వార్గల నాయకులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో సభ్యులు

ఆమనగల్లు: రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొద్దుటూరి రవీందర్‌గుప్తా కోరారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకట నర్సింహా గార్డెన్స్‌లో ఆదివారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఆమనగల్లు డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మిట్టపల్లి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా మంచుకొండ విష్ణువర్ధన్, కోశాధికారిగా జ్ఞానేశ్వర్, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గుప్తా మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్‌మిల్లులు సరిగా నడవకపోవడంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. రైస్‌మిల్లర్ల నిర్వహణ భారంగా మారిందని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రైస్ మిల్లులకు లెవీధాన్యం సేకరించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామనాథం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తం

ప్రజారోగ్యంపై వైద్య శాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు అందించే వైద్య సేవలపై ఈ నెల 10, 11వ తేదీల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఇందుకు వైద్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల మళ్లీ కరోనా కేసులు నమోదవుతుండటంతో ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. మాక్ డ్రిల్‌లో ఆస్పత్రుల వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో చేర్చనున్నారు.

నేటి నుంచి వైద్యశాఖ మాక్ డ్రిల్

- కరోనా మళ్లీ వ్యాపిస్తుండటంతో చర్యలు
- ఆస్పత్రుల్లో మౌలికవసతుల కల్పన



తాండూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

తాండూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏటా వైద్య సేవలు మెరుగు పడుతున్నాయి. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్పుచేసి వైద్యులను, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. దీంతో ప్రజలకు వైద్యం చేరువైంది. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యం అందేలా వైద్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

మౌలిక సదుపాయాలపై ఆరా..

జిల్లాలో మొత్తం 109 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం, తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితోపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 4, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 23, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు 2, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ (పల్లె దవాఖానా)లు 65, ప్రైవేటు ఆస్పత్రులు12, ప్రైవేట్ మెడికల్ కళాశాల ఉన్నాయి. జిల్లా వైద్య శాఖ అధికారి పల్వాన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే మాక్ డ్రిల్‌కు సర్వం సిద్ధం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కోవిడ్ రోగులకు వైద్య సేవలు అందించే సదుపాయాలపై వివరాలను సేకరించనున్నారు. అంతే కాకుండా ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్‌లు, ఆక్సిజన్ బెడ్లు ఎన్ని ఉన్నాయి? ప్రస్తుతం అందుబాటులో ఎన్ని ఉన్నాయనే వివరాలు సేకరించనున్నారు. అందుకోసం వైద్యులు క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నారు.

తాండూరులో రెండు ఆక్సిజన్ ప్లాంట్లు



తాండూరులోని ఆక్సిజన్ ప్లాంట్

తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, మాత శిశు ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం చికిత్స పొందుతున్న రోగులకు ఆక్సిజన్ అందుతోంది. అయితే ఇప్పటికే మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటంతో జిల్లా ఆస్పత్రి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కాయకల్ప కింద రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సారి కూడా ప్రథమ స్థానం నిలిచే అవకాశాలు ఉన్నాయని వైద్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నవత్‌రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు

కలిసి పోరాడుదాం.. రెడ్డి కార్పొరేషన్ సాధిద్దాం

- రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు
- వికారాబాద్‌లో 'ఆత్మీయ సమ్మేళనం'

అనంతగిరి: అందరం కలిసి పోరాడి రెడ్డి కార్పొరేషన్ సాధించుకుందామని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో రెడ్డి ఆత్మీయ సమ్మేళనం రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఆపదవచ్చినపుడు రెడ్లు ఏకమవడం ఆనాటి నుంచి చూస్తున్నామని, రాష్ట్రం ఆపదలో ఉందని మన రెడ్లమంతా ఒక్కటై భవిష్యత్తు సమాజం కోసం పాటుపడి ముందుకు సాగుదామన్నారు. సాయుధ పోరాటం మొదలు కొని, తొలి, మలి తెలంగాణ ఉద్యమాల్లో పాత్ర ఎంతో ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడినవారి కోసం ఈడబ్ల్యూసీ తీసుకువచ్చిన విషయం గుర్తుచేశారు. ప్రభుత్వంలో కొనసాగుతున్న మంత్రులు తమ వర్గాల్లో ఉన్న పేదల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఆలోచించాలన్నారు. అనంతరం బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పోరాడితే సాధించలేనిదేదీలేదన్నారు. పోరాటాలలో ముందుకు సాగడం మనకు తెలిసిందేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన తీరు యావత్ సమాజానికి తెలిసిందేనన్నారు. ప్రభుత్వం రూ.5వేల కోట్లతో చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్లకు, వైశ్యులకు కార్పొరేషన్‌నే ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఏర్పాటు చేయకుండా కాలాయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రులను, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్పొరేషన్‌ను సాధించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు మాధవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు , రెడ్డి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

వికారాబాద్ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన నవత్‌రెడ్డి ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పేదరికంలో ఉన్న మృతుని కుటుంబాన్ని కమిటీ తరపున రూ.1.48లక్షల నగదును వారి కుటుంబీకులకు అందజేశారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ

ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆదివారం వికారాబాద్‌లో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు ఎమ్మెల్యే ఆనంద్ పాల్గొన్నారు. ర్యాలీ ఆలంపల్లి నుంచి మిషన్ గ్రౌండ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. – అనంతగిరి



తెలంగాణకు ఏం చేశారో చెప్పండి

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: తెలంగాణకు ప్రధాని మోదీ ఎనిమిదేళ్ల కాలంలో ఏం చేశారో చెప్పాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రశ్నించారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ తెలంగాణలో పర్యటించిన ప్రతీసారి కేసీఆర్ కుటుంబంపై విషం చిమ్మడం తప్ప అభివృద్ధి మాటే లేదన్నారు. విభజన హామీ మేరకు రంగారెడ్డి- పాలమూరు, ఇతర ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇంత వరకు ఇవ్వ లేదని.. లక్షలాది ఎకరాల భూమికి సాగు నీరు అందిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లి గవ్వ ఇవ్వలేదని విమర్శించారు. గతంలో రావిర్యాలకు మంజూరైన ఐటీడీఆర్ ప్రాజెక్టు రద్దు చేసిన ఘనత బీజేపీ నాయకులదేనన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ.. కార్యకర్తలు సమృష్టిగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

హద్దు దాటితే చర్యలు తప్పవు..

బీఆర్‌ఎస్‌లో ఉంటూ.. పార్టీ ముఖ్యనేతల గురించి వ్యతిరేకంగా మాట్లాడితే, సోషల్ మీడియాలో పోస్టులు పెడితే క్రమ శిక్షణ చర్యలు తప్పవని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. ఇష్టం లేనివారు రాజీనామా చేసి బయటికి పోవాలని, పార్టీలో అంకితభావంతో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జెల్లాల లక్ష్మయ్య యాదవ్, వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు రవి నాయక్, నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల్లో ఎండుతున్న మొక్కలు

- కొరవడిన పర్యవేక్షణ
- మరమ్మతుకు నోచుకోని బోరు మోటారు

వికారాబాద్ అర్బన్: వన నర్సరీలపై పర్యవేక్షణ కొరవడటంతో మొక్కలు ఎండుతున్నాయి. ఇందుకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని నర్సరీలే నిదర్శనం. మున్సిపల్ పరిధిలో ఎనిమిది అర్బన్ నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. 18వ వార్డు కడ్పర్ల గుట్టలో ఏర్పాటు చేసిన మూడు అర్బన్ నర్సరీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఇక్కడ సుమారు 80వేల మొక్కలు పెంచుతున్నారు. అయితే మొక్కల సంరక్షణ ఎవరికీ పట్టడంలేదు. ఈ నర్సరీల్లో అనేక మొక్కలు ఎండి పోతున్నాయి. కొన్ని చోట్ల పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అయినా సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని రోజులుగా ఈ నర్సరీలకు ఉపయోగించే బోరు మోటారు మరమ్మతుకు చేరింది. ఈ కారణంగానే మొక్కలకు సక్రమంగా నీరు పట్టడంలేదని తెలిసింది. అదే పార్కులో మిషన్ భగీరథ నీటిని నింపే ఓవర్ హెడ్‌ట్యాంక్ ఉండటంతో అందులో నుంచి రోజు పైపుద్వారా నీరు మొక్కలకు తరలిస్తున్నట్లు సమాచారం. అది కూడా సక్రమంగా పట్టకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. బోరు మోటారు బాగుచేయించాలని సంబంధిత అధికారులకు చెప్పినా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి పెంచుతున్నా.. మొక్కలను కాపాడేందుకు అవసరమైన బోరు మోటారును బాగు చేయించలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికానా అధికారులు స్పందించి బోరు మోటారు బాగుచేసి మొక్కలను రక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.



నీరు అందక వాడిపోతున్న మొక్కలు

చేసింది తప్పే.. క్షమించండి

- బీసీ హాస్టల్ వార్డెన్ శశిరేఖ దంపతుల వేడుకోలు
- కళ్లులేని కబోదులం.. పిల్లలే మాకు లోకమంటూ ఆవేదన

బషీరాబాద్: విద్యార్థులు చదువుకోకుండా ఉదయం 8 గంటల వరకూ పడుకున్నారన్న కారణంగానే టిఫిన్ బంద్ పెట్టిన మాట వాస్తవమేనని బషీరాబాద్ బీసీ హాస్టల్ వార్డెన్ శశిరేఖ తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందునా బాగా చదువుకొని బాగుపడుతారనే అలా చేశాను తప్పా.. వారిని భయపెట్టాలన్న ఉద్దేశం కాదని ఆమె స్పష్టం చేశారు. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి వచ్చి తమ విద్యార్థులను రెచ్చగొట్టి వారితో ఆరోపణలు చేయించారని అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వార్డెన్ శశిరేఖ, తన భర్త రవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను 2018 నుంచి బీసీ బాలికల హాస్టల్‌లో వార్డెన్‌గా ఎలాంటి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని అన్నారు. కళ్లులేని కబోదినని, తన భర్త రవికి కూడా కళ్లుకనిపించవని, పిల్లలే లోకమని పనిచేస్తుంటే తమపై ఆరోపణలు చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. నాకు సహకారిగా భర్త హాస్టల్‌కువస్తే అతడిపైనా నిందలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను చేసింది తప్పేనని, దివ్యాంగులమైన మమ్ములను మన్నించాలని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధికారులకు వేడుకున్నారు.

అంధులతో ఆడుకుంటారా ..

అంధత్వం ఉన్న శశిరేఖ దంపతులను టార్గెట్‌గా చేసుకొని స్థానిక నాయకులు కొందరు రాజకీయం చేస్తున్నారని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి)రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. దళిత వర్గానికి చెందిన అంధురాలు కష్టపడి పనిచేస్తుంటే పిల్లలను అడ్డుపెట్టుకొని వారిని సస్పెండ్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. మరోవైపు బషీరాబాద్ మండల వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు చెరుకుల రాజుగౌడ్ మద్దతు ప్రకటించారు. అంధులైన వార్డెన్ దంపతులపై చర్యలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న వార్డెన్ శశిరేఖ దంపతులు, వారితో వీహెచ్‌పీఎస్ నాయకులు

వార్డెన్ భర్తపై పోక్సో కేసు

వార్డెన్ భర్తపై పోక్సో కేసు నమోదైంది. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వార్డెన్ భర్త రవి తరుచూ హాస్టల్‌కు వెళ్లేవారని అక్కడి బాలికలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందినట్లు చెప్పారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా తనకు ఏ పాపం తెలియదని, నా కళ్లు కూడా కనిపించవని రవి ఆవేదన వ్యక్తం చేశారు.

పంద్రాగస్టుకు డబుల్ అను'గృహం'!

- పురోగతిలో పేదల ఇళ్లు
- త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు
- ఇళ్ల కోసం 1,246 మంది దరఖాస్తు
- లబ్ధిదారుల ఎంపికకు అధికారుల కసరత్తు

కొడంగల్: పంద్రాగస్టు నాటికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చే విధంగా కసరత్తు జరుగుతోంది. అందులో భాగంగా పట్టణంలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణంలో వేగం పుంజుకుంది. కొన్ని ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న ఇండ్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి లబ్దిదారులకు కేటాయించాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. త్వరలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పంద్రాగస్టు వరకు గృహ ప్రవేశాలు జరిగే విధంగా చూస్తామని ఇళ్ల నిర్మాణం చేపట్టిన వీకేసీ ప్రాజెక్టు వర్క్ ప్రతినిధులు చెబుతున్నారు. కొడంగల్‌కు మొదటి దశలో 300 ఇళ్లు మంజూరయ్యాయి. పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో 168 ఇళ్లను నిర్మిస్తున్నారు. పట్టణ శివారులోని మిషన్ భగీరథ ప్లాంట్ దగ్గర 132 ఇళ్లను నిర్మించనున్నారు. 300 ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. గాంధీనగర్ సమీపంలో నిర్మిస్తున్న 168 ఇళ్లకు రూ.9 కోట్లు, మిషన్ భగీరథ దగ్గర నిర్మించే ఇళ్లకు రూ.7 కోట్లు కేటాయించారు.


1,246 మంది దరఖాస్తు

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొడంగల్, పాత కొడంగల్, తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల ప్రజలు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారం క్రితం ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్, అనుబంధ గ్రామాల నుంచి 1,246 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ ఉద్యోగులను బృందాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారు నిజంగా అర్హులా కాదా అనే విషయాన్ని గమనిస్తారు. అన్ని విషయాలను పరిశీలించి అర్హులను గుర్తిస్తారని అన్నారు. అర్హుల గుర్తింపును పారదర్శకంగా జవాబుదారీగా చేస్తామన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారని అన్నారు.



కొడంగల్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లు

త్వరలో పేదలకు కేటాయిస్తాం



డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తి చేసి అర్హులైన పేదలకు కేటాయిస్తాం. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. రెవెన్యూ అధికారులు అర్హులను గుర్తించడానికి సర్వే చేస్తున్నారు. త్వరలో ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పేదలందరికీ మేలు జరుగుతుంది. అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం. ఖాళీ స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 లక్షలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది.

– నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడంగల్

క్లుప్తంగా

గంజాయి విక్రేతలకు రిమాండ్

100 గ్రాముల గంజాయి స్వాధీనం

అనంతగిరి: గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీను తెలిపిన ప్రకారం.. శనివారం మధ్యాహ్నం శివరాంనగర్ కాలని పోచమ్మ గుడి వెనుకాల పట్టణానికి చెందిన సాయి, వంశీ అనే ఇద్దరు యువకులు ఇతరులకు గంజాయి విక్రయించేందుకు సిద్ధమయ్యారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడకు చేరుకుని వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 100గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బావిలో మోటారు తీసేందుకు వెళ్లి వ్యక్తి మృతి


రాజు మృతదేహం

పరిగి: బావిలో మోటార్ పంపు తీసేందుకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు(33) పొలం దగ్గరలోని బావిలోని మోటారు మరమ్మతుకు గురైంది. మోటార్‌ను బయటకు తీసేందుకు నీటిలోకి వెళ్లిన రాజు ఎంతసేపైనా పైకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, మెకానిక్ గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు బావిలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గ్రామస్తులకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న సిబ్బంది, గ్రామస్తులు వెతికి బావిలోంచి రాజు మృతదేహాన్ని బయటకి తీశారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు సంతానం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

తలకొండపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని జాతీయ బీసీ కమిషన మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. బంజార జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడని పేర్కొన్నారు. ఇతర కులాల వారికి కూడా ఆదర్శమూర్తిగా నిలిచారని గుర్తుచేశారు. ఆదివారం మండలంలోని పాతకోట తండాలో గిరిజన యూత్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆచారితో పాటు, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు, ఎంపీపీ తీర్మణీ నిర్మల, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సేవాలాల్ మహరాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు రాంరెడ్డి, అలివేలు, జీరానాయక్, లక్ష్మీ, గరుసింగ్, అనీల్, పాండు ప్రసాద్, రవిగౌడ్, శ్రీకాంత్, రవీందర్, జుమాని, పత్యానాయక్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు..

అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 14నుంచి 20వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తూ... ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. మరోవైపు ప్రమాదాల నుంచి రక్షించేందుకు అన్ని మండల కేంద్రాల్లో ఫైర్ ఇంజిన్‌లు అందుబాటులో ఉంచుతామని ప్రకటించినా ఇప్పటికీ హామీగానే మిగిలింది.

- అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు
- ఈ నెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు
- నిబంధనలు పాటించని పాఠశాలలు, ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలపై చర్యలు


తాండూరు ఫైర్ స్టేషన్

తాండూరు: అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు అగ్నిమాపక శాఖ జిల్లాలో మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దుకాణ సముదాయాలు, ప్రైవేటు పాఠశాలల భవనాలు నిబంధనలు పాటించకుంటే జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. ప్రమాదాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రతీ ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ వారోత్సవాలు నిర్వహించేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు ప్రారంభించారు.

ఆచరణకు నోచుకోని హామీ

జిల్లా పరిధిలో గతేడాది 250కి పైగా అగ్ని ప్రమాదాలు సంభవించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రమాదాల నివారణకు తాండూరు, పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాల్లో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. ప్రతీ కేంద్రంలో ఒక ఫైరింజన్‌తో పాటుగా, మిస్ట్ బుల్లెట్స్ (బైక్) అందుబాటులో ఉంచారు. వికారాబాద్ అగ్నిమాపక శాఖ పరిధిలోకి వచ్చే మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాలు జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్నాయి. ఆయా మండలాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించినా.. శకటాలు చేరుకునే లోగా భారీ ఆస్తి నష్టం వాటిల్లుతోంది. కాలిబూడిదయ్యాక వాహనాలు చేరుకున్న ఘటనలు అనేకం ఉన్నాయని ఆయా మండలాల వాసులు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం ప్రతీ మండల కేంద్రంలో అగ్నిమాపక శకటం అందుబాటులో ఉంచుతామని ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

వారోత్సవాల్లో తనిఖీలు

అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయనున్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటారు.

అవగాహన కల్పిస్తాం



అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వారోత్సవాల్లో కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు తనిఖీ చేస్తాం. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా గడ్డివాములు దగ్ధమవుతున్నాయి. అందుకు ప్రజల నిర్లక్ష్యమే కారణం. ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దుకాణాలు మూసే సమయాల్లో విద్యుత్ సరఫరా ఆఫ్ చేయడంతో ప్రమాదాలు సంభవించవు.

– నాగార్జున, అగ్నిమాపక శాఖ అధికారి, తాండూరు

అవగాహన లోపంతోనే అధిక చార్జీ

సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నజీర్

సాక్షి ఎఫెక్ట్..

కొడంగల్ : స్పెషల్ బస్సుల్లో చార్జీ ఎక్కువగా ఉంటుందని ప్రయాణికులకు కండక్టర్ ముందు చెప్పకపోవడంతోనే వారికి అదనపు భారం పడిందని ఆర్టీసీ అధికారులు అన్నారు. ఆదివారం 'సాక్షి' దిన పత్రికలో 'అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు సంకటం' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన నారాయణపేట ఆర్టీసీ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నజీర్ వివరణ ఇచ్చారు. కోస్గి నుంచి తాండూరు, తాండూరు నుంచి కోస్గికి ప్రయాణించినా బస్సు ఛార్జీ రూ.40లో మార్పు ఉండదన్నారు. అయితే బావోజీ జాతర కోసం ప్రత్యేక బస్సులు నడుతున్నందున ఒక బస్సు కోస్గి నుంచి తాండూరుకు వేశామన్నారు. స్పెషల్ బస్సులో ఛార్జీ ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాన్ని కండక్టర్ ప్రయాణికులకు ముందుగానే చెప్పాల్సి ఉంటుంది. కండక్టర్‌కు అవగాహన లేకపోవడంతో ప్రయాణికులకు ఎక్కువ చార్జీ పడిందన్నారు. ఈ విషయంపై సంబంధిత కండక్టర్‌ను వివరణ కోరామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఆర్టీసీ ఎల్లప్పుడు ముందు ఉంటుందన్నారు.

దోచుకున్నదంతా కక్కిస్తాం

- బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి
- హాత్ సే హాత్ జోడో యాత్రలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

బంట్వారం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కల్వకుంట్ల కుటుంబ దోచుకున్నదంతా కక్కిస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం ఆయన మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లిలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో వంట గ్యాస్ ధర రూ.400 ఉంటే ప్రధాని మోదీ పాలనలో రూ.1,250కు చేరిందన్నారు. అసమర్థ బీజేపీ పాలనలో పేదలు మరింత పేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్ల ధనం వెలికితీస్తామన్న ప్రధాని నేడు అవినీతి పరులకే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ లిక్కర్ స్కాం నుంచి తన కూతురును బయట పడేసేందుకు నానా తంటాలు పడుతున్నారని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని రూ.ఐదు లక్షల కోట్లు అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తన హయాంలో రూ.వెయ్యి కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. తాను వేసిన రోడ్ల పై స్థానిక ఎమ్మెల్యే తట్టెడు మట్టి కూడా వేయించని దుస్థితిలో ఉన్నాడన్నారు. రియల్ ఎస్టేట్ దందాలతో ఆయనకు ప్రజల సమస్యలు కనిపించడం లేదని విమర్శించారు. అనంతరం బంట్వారం మాజీ సర్పంచ్ చంద్రకళ నాయకులు సిద్దిరాములు స్వామి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి, మండల కోఆర్డినేటర్లు గౌస్, అజీం, బంట్వారం ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, నాయకులు ఎన్.నర్సింలు, వెంకటేశం, పురుషోత్తంరెడ్డి, తౌఫిక్, వీరేశం, మున్నాబాయ్, ఇసాక్, సలీం తదితరులు పాల్గొన్నారు.

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తా

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్


మాట్లాడుతున్న మురళీకృష్ణ గౌడ్

బషీరాబాద్: నావంద్గీ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని 12 రోజులుగా రైల్వే సాధన సమితి చేపట్టిన నిరసన దీక్షకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్ మద్దతు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో చేపట్టిన దీక్షకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణగౌడ్ మాట్లాడుతూ.. మండల పరిధి నుంచి ప్రతీ రోజు కార్మికులు కార్మికులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇతర పట్టణాలకు, నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారని.. వారికి సమయానికి రైళ్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో తాను ఇదే సమస్యను రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. సాంకేతిక కారణాల దృష్ట్యా చర్యలు తీసుకోవడంలో ఆలస్యం అవుతుందని చెప్పారు. హుబ్లీ, లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలపాలని తాను రైల్వే అధికారులు, బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు జయరామ్ చారి, రాఘవేందర్ చారి, బీజేపీ జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, మహిళా మోర్చా మండలం అధ్యక్షురాలు వీరమణి, ప్రశాంత్, హనుమంతు, శ్రీనివాస్, నవీన్ కుమార్, అంజి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్
- సర్పనపల్లిలో విగ్రహావిష్కరణ


మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

అనంతగిరి: దేశానికి దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని సర్పనపల్లిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. యువకులంతా అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. వివక్షతను రూపుమాపేందుకు ప్రతీ ఒక్కరు పాటు పడాలని సూచించారు. మహిళల అభ్యున్నతికి ఆయన ఎనలేని సేవలందించారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా సమానత్వంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మహనీయుల జయంతి కమిటీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్, నాయకులు బి.కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్, మేధావుల ఫోరం అధ్యక్షుడు దాసు, నాయకులు తిమ్మని శంకర్, కేవీపీఎస్ నాయకులు మహిపాల్, అంబేడ్కర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మెపా నూతన కమిటీల నియామకం


నూతన కార్యవర్గం

తాండూరు టౌన్: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) నియోజకవర్గ మండల కమిటీలను అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్లపల్లి సంజీవకుమార్ ముదిరాజ్ ఆదివారం ప్రకటించారు. తాండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సుభాశ్, శ్రీనివాస్ ముదిరాజ్, యాలాల అధ్యక్ష, కార్యదర్శులుగా మహేశ్, రవి, బషీరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లప్ప, రాములు, పెద్దేముల్ అధ్యక్ష, కార్యదర్శులుగా అశోక్‌కుమార్, బందెప్పలను నియమించామన్నారు. మెపా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వెంకటయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వారికి నియామక పత్రాలను అందజేశారన్నారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

కుల్కచర్ల మండల కమిటీ..

కుల్కచర్ల: మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామానికి చెందిన నరేందర్ మెపా మండల కమిటీ అధ్యక్షుడిగా, కుల్కచర్ల గ్రామానికి చెందిన శేఖర్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారికి జిల్లా అధ్యక్షకార్యదర్శులు రామాంజనేయులు, వెంకటయ్య నియామకంపత్రాలు అందేశారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ.. ముదిరాజ్ కమ్యూనిటీ ఉద్యోగులందరూ నిరుపేద ముదిరాజ్ ప్రజల అభ్యున్నతికి కృషిచేయాలన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


పరిగి: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే


కుల్కచర్ల: ముస్లింలకు విందు ఏర్పాటు చేసిన మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ఇఫ్తార్ విందులతో ఆత్మీయత, మతసామస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాసంలో ఉన్న ముస్లింలకు ఫలహారాలతో దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వమతసారం ఒక్కటే అని.. అందరం సోదరభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చౌడాపూర్ మండల కేంద్రంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా రంజాన్‌ను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఈ విందులో జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సర్పంచ్ కొత్త రంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, నాయకులు నర్సింలు, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

భళా.. ఫుడ్ మేళా!

తాండూరు: పట్టణంలోని ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఫుడ్ మేళా అలరించింది. తాండూరు వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆడిటోరియంలో వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, కౌన్సిలర్ మంకాల రాఘవేందర్, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఆర్యవైశ్య, వాసవి సంఘం సభ్యులు హాజరయ్యారు. నోరూరించే వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద తాండూరు పట్టణానికి చెందిన ప్రజలు రుచి చూసేందుకు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో నగరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కుంచం మురళీధర్, పాట్లి మహరాజ్ ఆలయ కమిటీ చైర్మన్ భానుకుమార్, వాసవి వాహిళా సంఘం అధ్యక్షురాలు కల్వ సరిత, ప్రధాన కార్యదర్శి గుబ్బ ప్రగతి, కోశాధికారి కోస్గి సరిత, మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో వంటకాల రుచి చూస్తున్న చైర్‌పర్సన్ స్వప్న తదితరులు

ఎస్‌ఐ పరీక్షలు రాసేందుకు వచ్చి..

ఆకతాయిల దాడిలో గాయపడిన కానిస్టేబుల్

బంజారాహిల్స్: ఎస్‌ఐ పరీక్షల కోసం ఏడాది కాలంగా కష్టపడి చదివాడు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించడంతో మెయిన్స్ పరీక్ష రాసేందుకు నగరానికి వచ్చాడు. మొదటి రోజున పరీక్షలు బాగా రాశానని, రెండో రోజు పరీక్షలు బాగా రాస్తే ఎస్‌ఐ ఉద్యోగం ఖాయమంటూ ఆనందంగా ఉన్నాడు. ఈలోగానే దురదృష్టం వెక్కిరించింది. రోడ్డుమీద వెళ్తుండగా ఓ ఆకతాయి యువకుడితో పాటు అతడి స్నేహితులు దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలపాలై ఎస్‌ఐ పరీక్షలకు దూరమయ్యాడు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అనిల్‌గౌడ్ ఎస్‌ఐ పరీక్షలు రాసేందుకు రెండురోజుల క్రితం నగరానికి వచ్చాడు. మొదటిరోజైన శనివారం పరీక్షలు రాసిన అనిల్‌గౌడ్ కృష్ణానగర్‌లో ఉంటున్న తన సోదరుడు శ్రీనివాస్ గదికి వచ్చాడు. మరో సోదరుడైనసీఆర్‌కానిస్టేబుల్ అనంతం గౌడ్ కూడా అక్కడికి వచ్చారు. ఆదివారం జరగాల్సిన రెండోరోజు పరీక్షలకు ప్రిపేరయిన అనిల్ తన సోదరులతో కలిసి శనివారం రాత్రి రాత్రి 8.30 ప్రాంతంలో కర్రీస్ సెంటర్‌లో కర్రీస్ తెచ్చుకునేందుకు రోడ్డు మీదకు వచ్చాడు. రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న జునైద్ (31) అనేవ్యక్తి తన కారులో ర్యాష్‌గా డ్రైవ్ చేస్తూ వచ్చి అనిల్ తదితరులను తాకుతూ వెళ్లాడు. ట్రాఫిక్‌లో కారును జాగ్రత్తగా చూసి నడపాలంటూ అనిల్ మందలించాడు. దీంతో ఆగ్రహానికి లోనయిన జునైద్‌తో పాటు అతడి స్నేహితుడు తన్వీర్ అహ్మద్ తదితరులు కారులోనుంచి దిగి అనిల్ గౌడ్‌ను, అతడి సోదరుడు అనంతం గౌడ్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మరికొంతమంది స్నేహితులను జుబేర్ ఫోన్‌చేసి పిలిపించి మరోసారి దాడికి దిగారు. దీంతో అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. అడ్డుకునేందుకు యత్నించిన అనంతం గౌడ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన అనిల్‌గౌడ్‌ను కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్పి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు బాధితుడి సోదరుడు అనంతం గౌడ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులు జుబేర్, తన్వీర్‌తో పాటు ఇతరులపై ఐపీసీ 279, 325, 341,367 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా తీవ్రంగా గాయపడిన అనిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం జరిగిన ఎస్‌ఐ పరీక్షలకు హాజరు కాలేకపోయాడు. ప్రధాన నిందితులు జుబేర్, తన్వీర్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు ఇతర నిందితుల కోసం గాలింపు చేపట్టారు, సంఘటనా స్థలంలో సీసీ పుటేజీలు సేకరిస్తున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

పెద్దేముల్: ఆరుగురు పేకాటరాయుళ్లను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని కందనెల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామ శివారులోని ఓ చెట్టుకింద ఆరుగురు వ్యక్తులు పేకాడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాటస్థావరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2,300 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

యాలాల: కాగ్నా నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ అరవింద్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కోకట్ కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అందింది. ఈ మేరకు యాలాల పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ రవాణా కోసం వచ్చిన రెండు ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నామని వారు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.